క్లుప్తంగా

నేడు ఉప్పాలమ్మ తీర్థం

కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి తీర్థం శనివారం జరగనుంది. ఏటా చైత్రమాసం పౌర్ణమి రోజున ఈ తీర్థం జరుగుతుంది. గ్రామంలో 15 రోజుల ముందునుంచీ అమ్మవారి ప్రతిరూపమైన గరగలను ఊరేగించారు. శుక్రవారం రాత్రి గరగ నృత్యాలు, గారడీ, డప్పు వాయిద్యాలతో జాతర నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరకత మణికంఠ

బోట్‌క్లబ్: జన్మనక్షత్రమైన ఉత్తరా సందర్భంగా శుక్రవారం స్థానిక రిజర్వ్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ ఏర్పాట్లు చేశారు. పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయం ప్రాంగణంలోని అయ్యప్పస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక రామారావుపేటలోని మరకత మణికంఠకు ప్రత్యేక పూజలు జరిగాయి. పీఠం అర్చకులు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఊయల సేవ, దీపోత్సవం జరిగాయి.

22న జగ్గంపేటలో శాంతి ర్యాలీ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: తొలి సోషలిస్టు రాజ్య నిర్మాత, మార్క్సిస్ట్ మహోపాధ్యాయుడు వీఐ లెనిన్ జయంతిని పురస్కరించుకుని, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా ఈ నెల 22న శాంతి ర్యాలీ, సభను నిర్వహిస్తున్నట్టు ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక అచ్యుతాపురం రైల్వే గేట్ వద్ద ఏఐఎఫ్‌టీయూ జెండా స్తంభం వద్ద ఈ మేరకు కరపత్రాన్ని ఏపీ రైతు కూలీ సంఘం, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, పీడీఎస్‌యూ తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఏపీఆర్‌సీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ఈ నెల 22న వీఐ లెనిన్ జయంతి సందర్భంగా, మధ్య భారత అడవుల్లో సాగుతున్న కగార్ దాడికి వ్యతిరేకంగా, ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాద అధర్మ యుద్ధాల అంతానికి ఊరూవాడా శాంతి ర్యాలీ, సభలు జరపాలని నిర్ణయించినట్టు వివరించారు. 22న ఉదయం 10 గంటల నుంచి జగ్గంపేటలో శాంతి ర్యాలీ, సభ జరుగుతుందన్నారు. ఆయా సంఘాల నాయకులు వల్లూరి రాజబాబు, కుంచే అంజిబాబు, కడితి సతీష్, మడికి సత్యం, కర్నాకుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధునిక వైద్యంతో ప్రసవ మరణాల నియంత్రణ

కాకినాడ రూరల్: ప్రసవ మరణాలను ఆధునిక వైద్య చికిత్సలతో చాలావరకు నియంత్రించవచ్చని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ సురక్షిత మాతృత్వ దినాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాతృత్వ మరణాల నియంత్రణకు ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. క్షేత్ర స్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తల నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రాజా పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే, అనుబంధ కళాశాల విద్యార్థులకు పట్టాతో పాటు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నట్టు ఐఐఐపీటీ(ఇండస్ట్రీ ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ ప్లేస్‌మెంట్ ట్రైనింగ్) డైరెక్టర్ బత్తుల తిరుమలకృష్ణ అన్నారు. జేఎన్‌టీయూకేలో శుక్రవారం వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలన్నారు. అరబిందో సంస్థ బీఫార్మసీ, ఎం ఫార్మసీ, డిప్లమో విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది.

సీతారామస్వామికి నివాళి

బోట్‌క్లబ్: ప్రముఖ వైద్యులు, సాహితీవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి పిఠాపురానికి చెందిన వైద్యులు గజరావు సీతారామస్వామి సంస్మరణ సభ శుక్రవారం స్థానిక గాంధీభవన్‌లో జరిగింది. నగరంలోని సంగీత, సాహిత్య సంస్థల సభ్యులు సంయుక్తంగా నిర్వహించారు. వైద్యునిగా సీతారామస్వామి పేదలకు చేసిన సేవలను ప్రముఖ వైద్యుడు వాడ్రేవు రవి వివరించారు. జోస్యుల కృష్ణబాబు, గొట్టుముక్కల నరసింహశాస్త్రి ఆయన సంగీత, సాహిత్య పరిజ్ఞానాన్ని, సాంస్కృతిక సేవలను కొనియాడారు. సాహితీవేత్త మేకా మన్మథరావు, మార్ని జానకిరామచౌదరి, కొరుప్రోలు గౌరినాయుడు, గొట్టుముక్కల నరసింహశాస్త్రి, గట్టి శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు.

వంటొద్దు పోకడ

- పేదల నెత్తిపై 'కూటమి' బండ
- వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు భారం
- డివిజన్‌పై నెలకు రూ.2.32 కోట్ల బాదుడు



కాకినాడ సిటీ: సామాన్యుడి వంటింట్లో ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ మంట పెట్టింది. కొన్ని రోజులుగా వాణిజ్య సిలిండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగదారులకు వాత పెట్టింది. పేద, సామాన్య కుటుంబాలకు గ్యాస్ ధర గుదిబండగా మారింది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సామాన్యుడిపై మరో భారం పడింది. కేంద్రప్రభుత్వం పేద, సామాన్య కుటుంబాల్లో గ్యాస్ మంటలు రేపింది. గృహ వినియోగ సిలిండర్ ధర రూ.840 ఉండగా, తాజాగా కేంద్రం మరో రూ.50 పెంచింది. దీంతో పేదవర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.. ఉజ్వల పథకం లబ్ధిదారులను సైతం ప్రభుత్వం కనికరించలేదు. వారికి కూడా ఈ పెంపు వర్తింపజేయడం గమనార్హం. ఇకపై ప్రతి 15 రోజులకు లేదా నెలకోసారి ధరలపై సమీక్షిస్తామని ప్రకటించడంతో, భవిష్యత్తులో గ్యాస్ ధర మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయనే సంకేతాలు ఇచ్చినట్టయింది.

రూ.2.32 కోట్లకు పైగా భారం

గ్యాస్ సిలిండర్ ధర పెంపుతో కాకినాడ డివిజన్ వ్యాప్తంగా వినియోగదారులపై నెలకు రూ.2.32 కోట్ల మేర అదనపు భారం పడనుంది. డివిజన్ పరిధిలోని పలు గ్యాస్ ఏజెన్సీల పరిధిలో మొత్తం 1.94 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, అందులో 4,600 వరకు వాణిజ్యపరమైనవి. మిగిలిన 1.89 లక్షల కనెక్షన్లకు ఈ పెంపు వర్తించనుంది. ఈ లెక్కన జిల్లాలోని వినియోగదారులపై రూ.2.32 కోట్ల అదనపు భారం పడింది. ప్రస్తుతం జిల్లాలో గృహ వినియోగానికి సంబంధించిన 14.2 కేజీల గ్యాస్ సిలిండర్ ధర రూ.840 ఉండగా, ఇకపై రూ.890 కానుంది. నిబంధనలకు విరుద్ధంగా రవాణా చార్జీల పేరుతో వసూలు చేస్తున్న మొత్తం అదనం. దీంతో సిలిండర్ కోసం రూ.920 సమర్పించుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏజెన్సీల పరిధిలో ఐదు కి.మీ.లోపు అదే ధరకు వినియోగదారులకు ఇవ్వాల్సి ఉండగా, అది ఎక్కడా అమలు కావడం లేదు.

సామాన్యులపై తీవ్ర ప్రభావం



వంట గ్యాస్ సిలిండర్ ధర పెంపు సామాన్య ప్రజలకు, మహిళలకు భారమవ్వడమే కాక, పేద, మధ్య తరగతి ప్రజానీకంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇప్పటికే కొనలేని స్థితిలో ఉన్న గ్యాస్ సిలిండర్ ధర మరింత పెరగడం గృహిణులను ఆవేదనకు గురి చేస్తుంది. సగటున ఒక్కో కుటుంబం ఏడాదికి ఆరు సిలిండర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ఆ మేరకు అదనపు ధర చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి గ్యాస్ సిలిండర్ ధరలతో పాటు, నిత్యావసర సరకుల ధరలను నియంత్రించాలి.

– పలివెల వీరబాబు, సీపీఎం నాయకులు, కాకినాడ

ధరల పెంపుతో తప్పని తిప్పలు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలను పెంచుతుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ఒకవైపు కూరగాయల ధరలు భగ్గుమంటూ నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకుతుండడం, మరోవైపు వంట గ్యాస్ సిలిండర్ ధర పెరగడం చాలా బాధాకరం. ప్రభుత్వాలు స్పందించి ధరలను అదుపు చేసి పేదలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

– బొడిరెడ్ల పుష్ప, సంజయ్‌నగర్, కాకినాడ

గ్యాస్ ధర తగ్గించాలి



రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కరెంటు చార్జీలతో పాటు, అనేక భారాలు మోపింది. డీజిల్, పెట్రోల్ ధరలు కూడా పెరగడం నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడానికి కారణమైంది. ఈ పరిస్థితుల్లో పేదవాళ్లం బతకడమే కష్టంగా ఉంది. ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా ధరలు పెంచుకుంటూ పోవడం సమంజసం కాదు. పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి.

– జి.జనని, సాంబమూర్తినగర్, కాకినాడ

పీజీఆర్‌ఎస్ రద్దు

కాకినాడ క్రైం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేశారు. జిల్లా ఎస్పీ బిందుమాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు.

కలెక్టరేట్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, దాతలు రక్తదానం చేశారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా కూడా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. శిబిరంలో 50 మందికి పైగా రక్తదానం చేశారు. కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎస్.రామమోహన్తో పాటు, కలెక్టరేట్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ ఉద్యోగులు, వికాస, గ్యాస్ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు. సొసైటీ చైర్మన్ వైడీ రామారావు, కార్యదర్శి కె.శివకుమార్ పర్యవేక్షించారు.

బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ధర్నా

కాకినాడ సిటీ: బీసీలకు చట్టసభల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కాకినాడలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. బీసీ సంఘ నాయకులు పంపన రామకృష్ణ, చొల్లంగి వేణుగోపాల్, బీఎస్పీ నాయకులు ఎం సుబ్రహ్మణ్యం, అయినవిల్లి నారాయణగౌడ్, 93 బీసీ కులాల అధ్యక్షులు మాకినీడి భాస్కర్ గణేష్, బీసీ, దళిత నాయకులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఆభరణాల చోరీ

కాకినాడ క్రైం: నగరంలోని కొవ్వూరు రోడ్డుకు చెందిన మహిళ తన ఇంట్లో బంగారం చోరీ అయినట్టు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు, వినాయక వీధికి చెందిన శ్రీనివాస వడివేలు శైలజ స్థానికంగా సిస్టం ఆపరేటర్‌గా పనిచేస్తోంది. ఈ నెల పదిన రాత్రి ఇంట్లో వారంతా నిద్రపోయారు. ఉదయం లేచి చూసేసరికి ఇంట్లో సామాన్లన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో 11 కాసుల బంగారు ఆభరణాలు, 12 గ్రాముల వెండి వస్తువులు, రూ.15 వేల నగదు మాయమయ్యాయి. దొంగలు చాకచక్యంగా తలుపు గెడ తీసి లోనికి ప్రవేశించారు. తాళం వేయని బీరువాలో ఉంచిన సొత్తును అపహరించినట్టు గుర్తించారు. కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనుల విందుగా అమ్మవారి తెప్పోత్సవం



కోనేరులో నిర్వహిస్తున్న తెప్పోత్సవం



ఆకట్టుకున్న వేషధారణలు

బోట్‌క్లబ్: కల్యాణోత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పడవలో ఉంచి, ఆలయ కోనేరులో మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గరగల నృత్యం, చెండ్రై మేళం, కోలాటం అలరించింది. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ కోనేరు ప్రాంతం కిటకిటలాడింది. తొలుత తెప్పోత్సవాన్ని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రారంభించారు. ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

బార్ ఎన్నికల్లో 29 మంది పోటీ

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్‌కు ఈ నెల 21న జరిగే ఎన్నికలకు వివిధ పదవులకు 29 మంది పోటీలో ఉన్నారు. అధ్యక్ష పదవికి పి.ప్రసన్నకుమార్, ఏలూరి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్ష పదవికి ముత్తా వెంకన్న, పి.రామచంద్రరాజు, ప్రధాన కార్యదర్శికి సీహెచ్ వీరభద్రరావు(చంటి), కేవీవీఎస్ఎన్ మూర్తి, రెడ్డి అన్నవరం, ఒబిలిశెట్టి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శికి వెలిగొట్ల శ్రీనివాస్, బండి నరేంద్ర పోటీ పడుతున్నారు. అలాగే కోశాధికారి పదవికి జి.వెంకట దుర్గాప్రసాద్, కోకా వెంకటకృష్ణారావు, లైబ్రరీ సెక్రటరీకి గండికోట కల్యాణి, మేడపాటి రామారెడ్డి, షేక్ అమీర్‌జానీ పోటీలో ఉన్నారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీకి గింజాల చక్రవర్తి, జోకా వీఎస్ విజయకుమార్, మంగా వెంకట శివరామకృష్ణ, మహిళా ప్రతినిధి పదవికి జి.దివ్య శ్రీవిద్య, ఎస్.స్వర్ణలత పోటీ పడుతున్నారు. ఉప సంహరణ అనంతరం ఒక్కరే మిగలడంతో సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా వేగుళ్ల వెంకటరమణమూర్తి ఏకగ్రీవమయ్యారు. సీనియర్ కమిటీ మెంబర్‌కు నక్కా సంజీవ్‌కుమార్, ఎర్మల్ వసంతకుమార్ పోటీలో ఉన్నారు. మహిళా కమిటీ మెంబర్‌గా కె.శ్రీవాణి ఏకగ్రీవమయ్యారు. అలాగే కమిటీ మెంబర్లుగా దుళ్ల నాగబాబు, గుత్తుల మంగరాజు, ఎం.ప్రసాదరావు, మర్ల ప్రవల్లిక, షేక్ ప్రేమ్‌నజీర్ పోటీలో ఉన్నారు. మొత్తం 32 నామినేషన్ల వేయగా, శుక్రవారం ఉపసంహరణ అనంతరం 29 మంది మిగిలినట్టు ఎన్నికల అధికారి ఎం.విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ ఎన్నికల అధికారి చెక్కా శ్రీనివాస్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మంగళవారం 29 మందిని కోర్టులో హాజరుపర్చగా, ఒకరికి ఐదు, ఆరుగురికి మూడు, ఇద్దరికి రెండు రోజుల చొప్పున జైలు, 20 మందికి జరిమానా విధించారు.



కరపలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు



పూలే చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్



అన్నమ్మఘాటీ సెంటర్‌లో పూలే విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఐక్య వేదిక నాయకులు



కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో..



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడబాల ట్రస్ట్ సభ్యులు

సామాజిక విప్లవకారుడు పూలే

జయంతి కార్యక్రమాల్లో వక్తల నివాళి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ భాస్కరరావు



ఏపీఎస్పీలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమాండెంట్ దేవానందరావు

కాకినాడ రూరల్: తొలితరం సామాజిక విప్లవకారుడైన మహాత్మా జ్యోతిరావ్ పూలే కుల వివక్షతను, సాంఘిక దోపిడీని, మూఢ నమ్మకాలను వ్యతిరేకించారని రాష్ట్ర గ్రంథాలయ విశ్రాంత అధికారి చింతపల్లి సుబ్బారావు అన్నారు. స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే జయంతి జరిగింది. ఆయన మాట్లాడుతూ, ఎందరో మహనీయులకు పూలే జీవితం స్ఫూర్తి నింపిందన్నారు. వితంతువులు, అనాథ పిల్లల కోసం దేశంలోనే తొలిసారిగా శరణాలయం స్థాపించారన్నారు. కార్యక్రమంలో సభ్యులు అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. కాకినాడ శాంతిభవన్ సెంటర్‌లోని పూలే విగ్రహానికి శెట్టిబలిజ సంఘ నాయకుడు కడలి రాంపండు నివాళులర్పించారు. స్థానిక రమణయ్యపేట వద్ద పూలే విగ్రహానికి కాకినాడ ఐడీఏ ఆధ్వర్యంలో సభ్యులు శ్రద్ధాంజలి ఘటించారు. సంఘ కాకినాడ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ, అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు, మహిళోద్ధరణకు పూలే కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ కాకినాడ కార్యదర్శి డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ సిరాజ్ పాల్గొన్నారు.

ఏపీఎస్పీలో..

మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా స్థానిక రమణయ్యపేట మూడో బెటాలియన్ ఏపీఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు నివాళులర్పించారు. దేశంలో మహిళా విద్యను అందించడంలో ఎంతో కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. అసిస్టెంట్ కమాండెంట్లు చంద్రశేఖర్, మన్మథరావు, మోహన్‌రావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో..

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం స్థానిక ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో సామాజిక న్యాయం, మహిళా సాధికారతకు బాటలు వేసిన మహనీయులు జ్యోతిరావ్ పూలే జయంతి, స్వాతంత్ర్య ఉద్యమంలో విశిష్ట పాత్ర పోషించిన కస్తూర్బా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ మాట్లాడుతూ, దేశంలో అణగారిన వర్గాల కోసం విద్యారంగాన్ని ఓ ఆయుధంగా మలిచి, మార్గదర్శకునిగా నిలిచారన్నారు. అలాగే కస్తూర్బా గాంధీ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీకి తోడుగా నిలిచి, అనేక సామాజిక ఉద్యమాల్లో పాలుపంచుకున్నారన్నారు. వివిధ విభాగాల అధ్యాపక, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

కరప: సామాజిక అసమానతలు రూపుమాపేందుకు అహర్నిశలు శ్రమించిన మహాత్మా జ్యోతిరావ్ పూలే ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అన్నారు. కరపలో సంఘ సంస్కర్త పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు సొంత ఖర్చుతో నిర్మించిన మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి ఎంపీపీ నివాళులర్పించారు. దేశంలో తొలి బాలికా పాఠశాలను ప్రారంభించిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. వలసపాకల, కొరిపల్లి సర్పంచ్‌లు వాసంశెట్టి రామారావు, పలివెల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాదే లోహిదాస్, కమిడి శంకర్, పెంకే సత్తిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మంచాల శ్రీనివాస్, పెంకే మంగరాజు, పీహెచ్‌సీ డాక్టర్ వి.ఏంజలిన్, గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ కె.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపీపీ శ్రీలక్ష్మి, ఏఓ బీఎల్ నరసింహారావు, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు నివాళులర్పించారు.

ఐక్య వేదిక నేతల ఆధ్వర్యంలో..

కాకినాడ సిటీ: నగరంలోని జగన్నాథపురం ఘాటీ సెంటర్‌లో మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక, దైవ కృప ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, కాన్షీరాం విగ్రహాలకూ పూలమాలలు వేశారు. వేదిక నాయకులు డోకుబుర్ర భద్రం, కొమ్ముకూరి నాగేశ్వరరావు, పాలేటి కృపానందం, ఏడిద లాజరు తదితరులు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా టీడీపీ కార్యాలయంలో సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, చిక్కాల రామచంద్రరావు తదితరులు పూలేకు నివాళులర్పించారు. కాకినాడ-యానాం ప్రధాన రహదారిలో పగడాలపేట వద్ద ఉన్న పూలే విగ్రహానికి స్థానిక బీసీ సంఘాల ప్రతినిధులు పంపన రామకృష్ణ, గరికిన పెద్దరాజు, గరికిన అప్పన్న, బొమ్మిడి శ్రీనివాసరావు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో కాకినాడ పాత బస్టాండ్ అంబేడ్కర్ భవనం వద్ద పూలే విగ్రహానికి నివాళులర్పించారు.

బోట్‌క్లబ్: అణగారిన వర్గాలకు సమాన హక్కులు సాధించడానికి జ్యోతిరావ్ పూలే ఎనలేని పోరాటం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. పూలే జయంతి సందర్భంగా స్థానిక జీజీహెచ్ సెంటర్‌లోని పూలే విగ్రహానికి ఆయన నివాళులర్పించారు.

ఎస్పీ కార్యాలయంలో..

కాకినాడ క్రైం: మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి అదనపు ఎస్పీ భాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వెనుకబడిన ప్రజల ఉన్నతి కోసం పూలే తన జీవితాన్ని అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు, సీఐలు, వివిధ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో పూలే చిత్రపటానికి డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ నివాళులర్పించారు. సామాజిక దురాచారాలైన అంటరానితనం, కుల, మత బేధాలకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశారు. డీఎల్‌వో డాక్టర్ ఆర్.రమేష్, డీసీహెచ్ఎస్ డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీఐవో డాక్టర్ ఐ.ప్రభాకరరావు, డెమో ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి డాక్టర్ అడ్డాల నివాళులు



పూలే, కస్తూర్బా గాంధీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతిశ్రీ తదితరులు